సాక్షి బాపట్ల

గురువారం । 1 । మే । 2025



ఆంజనేయుడికి మల్లెపూల అర్చన

సత్తెనపల్లి: నాగన్నకుంటలోని శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామిని మల్లెపూలతో అలంకరించి, అర్చన జరిపారు.



ముగిసిన బాలయేసు చర్చి తిరునాళ్ల

నాదెండ్ల: కనపర్రు బావివద్ద కొలువైయున్న బాలయేసు పుణ్యక్షేత్ర తిరునాళ్ల బుధవారంతో ముగిసింది. విచారణ గురువు జోజయ్య ప్రత్యేక ప్రార్థనలు, దివ్యపూజాబలి నిర్వహించారు.



చందన అలంకారంలో నారసింహుడు

తెనాలి: నాజరుపేటలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో బుధవారం అక్షయ తృతీయ వేడుకలు జరిగాయి. చందన అలంకారంతో స్వామి దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అద్దంకి: పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం శంకుస్థాపన చేశారు. ద్వారకానగర్‌లో రూ.4.50 కోట్లతో నూతనంగా నిర్మించనున్న 33/11కేవీ సబ్ స్టేషన్, ఎన్నెస్పీ కాలనీలో రూ.6.73 కోట్లతో నిర్మించనున్న 33/11 కేవీ సబ్ స్టేషన్, శింగరకొండ రోడ్డులోని రూ. 2.25 కోట్లతో నిర్మించనున్న ఫైర్ స్టేషన్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బగళాముఖి అమ్మవారి తిరునాళ్ల ప్రారంభం



చందోలు(కర్లపాలెం): బగళాముఖి అమ్మవారి వార్షిక తిరునాళ్ల మహోత్సవాలలో భాగంగా బుధవారం వైభవంగా కొలుపులు ప్రారంభమయ్యాయి. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు ఈ నెల 5వ తేదీ వరకు జరగనున్నాయి. తొలిరోజు అఖండ జ్యోతి దీపారాధనతో వేద మంత్రాలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. శ్రీ ఉమాసుందరి మహాదేవి విశేష అలంకరణ చేశారు. వీరాచార ఆచారవంతుల సంప్రదాయం ప్రకారం అమ్మ వారికి వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ప్రతిరూపాలైన పావనము, ఘటము, చందోలు కొత్తరెడ్డిపాలెం, సంగుపాలెం గ్రామాలలో ఊరేగించారు. 3వ తేదీన అమ్మవారికి పురాతన బంగారు నగలను అలంకరిస్తామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

విజయకీలాద్రిపై తిరునక్షత్ర మహోత్సవం



తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి సీతానగరం విజయకీలాద్రిపై గల స్వామికి బుధవారం తిరునక్షత్ర మహోత్సవం వైభవంగా నిర్వహించారు. 1008వ భగవద్రామానుజాచార్యస్వామి తిరునక్షత్ర మహోత్సవాల్లో భాగంగా ఉదయం అభిషేకం, సేవా కాలం, అర్చన, తీర్థప్రసాద గోష్టితో కార్యక్రమం సుసంపన్నమైంది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి అనుగ్రహాన్ని పొందారు.

రేపటి నుంచి వేద పరీక్షలు

తెనాలి రూరల్:మండలంలోని పెదరావూరు పరిధిలో ఉన్న శ్రీ అభయహస్త సుబ్రహ్మణ్య క్షేత్రంలో ఈ నెల 2వ తేదీ నుంచి 4 వరకు వేద పరీక్షలు, సభలు జరుగుతాయని కార్యవర్గం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆస్తికులంతా పాల్గొనాలని కోరింది.

'బత్తి భుచావ్'



లక్ష్మీపురం:వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లిం మైనారిటీలకు చెందిన ఇళ్లు, వ్యాపార సముదాయాలలో బత్తి భుచావ్ (లైట్ ఆఫ్ చేయడం) కార్యక్రమాన్ని చేపట్టాలని ముస్లిం సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి 9 గంటల నుంచి గుంటూరు నగరంలో ముస్లింలు ఇళ్లు, పలు వీధుల్లో 15 నిమిషాల పాటు లైట్లు నిలిపి నిరసన వ్యక్తం చేశారు.

సజావుగా పాలిసెట్

84 శాతం మంది హాజరు

గుంటూరు ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష బుధవారం సజావుగా జరిగింది. గుంటూరు నగరంలో 11 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 4,055 మంది విద్యార్థులకు గానూ 3,408 మంది హాజరయ్యారు. 84 శాతం హాజరు నమోదైనట్లు పాలిసెట్–25 సమన్వయకర్త తాళ్లూరి శేఖర్ తెలిపారు

బిల్లుల్ని పేల్చేస్తున్న తమ్ముళ్లు!

పేలుడు పదార్థాలు జిల్లాకు పెద్ద ఎత్తున తరలి వస్తున్నాయి. అవి కూడా చాలామటుకు ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా దిగుమతి అవుతున్నాయి. బల్లికురవ, సంతమాగులూరు, గురిజేపల్లి, ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని చీమకుర్తి ప్రాంతాల్లోని క్వారీల్లో పేలుళ్ల కోసం వీటిని వినియోగిస్తున్నారు. ఈ పేలుడు పదార్థాలను హైదరాబాద్, నాగపూర్, చెన్నైల నుంచి తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. దిగుమతి అవుతున్న పేలుడు పదార్థాలలో 80 శాతం వాటికి ఎటువంటి బిల్లులు కూడా ఉండవని సమాచారం.

- యథేచ్ఛగా ఎక్స్‌ప్లోజర్స్ విక్రయం
- 80 శాతం వరకు బిల్లుల్లేని అమ్మకాలే
- లైసెన్స్ హోల్డర్ల అక్రమ వ్యాపారాలు
- చీమకుర్తి ప్రాంతంలో పచ్చ నేత దందా
- కూటమి పాలన వచ్చాక తనిఖీలు శూన్యం



బల్లికురవ ప్రాంతంలో గ్రానైట్ క్వారీ

సాక్షి ప్రతినిధి, బాపట్ల: చీమకుర్తి, బల్లికురవ ప్రాంతాలకు చెందిన కొందరు లైసెన్స్ హోల్డర్లు అక్రమంగా దిగుమతి చేసుకొని క్వారీల యజమానులకు విక్రయిస్తున్నారు. బిల్లులు లేకుండా దొరుకుతుండడంతో క్వారీ యజమానులు వీలయినంత ఎక్కువగా పేలుడు పదార్థాల కొనుగోలుకు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

అడ్డగోలుగా వ్యాపారం

- చీమకుర్తి కేంద్రంగా పేలుడు పదార్థాల వ్యాపారం నడిపిస్తున్న త్రినాథరావు అనే వ్యక్తికి 21 లైసెన్సులతోపాటు మరొకటి లీజుకు తీసుకున్న లైసెన్స్ ఉంది. ఆయన మూడు జిల్లాల్లో వ్యాపారానికి కింగ్ పిన్‌గా ఉన్నారు. చీమకుర్తి ప్రాంతంలో గోదాములు ఏర్పాటు చేసుకొని బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు సైతం బిల్లులు లేకుండానే పేలుడు పదార్థాలు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. కొందరు లైసెన్స్‌దారులు ఇతని పేరు మీదే ఇండెంట్ పెట్టుకుని పేలుడు పదార్థాలు తెప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యాపారి సరఫరా చేసే ఎక్స్‌ప్లోజర్స్‌లో కేవలం 20 శాతానికి మాత్రమే బిల్లులు ఇస్తున్నారని సమాచారం.
- బల్లికురవ ప్రాంతం నాగరాజు పల్లెకు చెందిన హరిప్రసాద్‌బాబు సైతం గంగపాలెం ప్రాంతంలో గోదాము ఏర్పాటు చేసి అక్రమంగా ఎక్స్‌ప్లోజర్స్ వ్యాపారం సాగిసున్నట్లు తెలుస్తోంది. సదరు వ్యాపారికి చీమకుర్తి, బల్లికురవ ప్రాంతాల్లో గోదాములు ఉన్నాయి. నెల్లూరు కేంద్రంగా కూడా వ్యాపారం సాగిస్తున్నట్లు సమాచారం.
- ఇదే గ్రామానికి చెందిన రాజేష్‌కుమార్ కూడా 20 వరకు క్వారీలకు 18 టన్నుల గోదాములు ఏర్పాటు చేసి ఎక్స్‌ప్లోజర్స్‌ను పెద్ద ఎత్తున విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.
- మార్టూరుకు చెందిన మల్లి వలపర్ల ప్రాంతంలో గోదాము ఏర్పాటు చేసుకొని అక్రమ పేలుడు పదార్థాలను విక్రయిస్తున్నట్లు సమాచారం.
- రామాంజిపురానికి చెందిన హనుమంతు అనే వ్యక్తి రామాంజిపురం ప్రాంతంలో 4 టన్నుల గోదాము నిర్మించుకొని పేలుడు పదార్థాల వ్యాపారం సాగిస్తున్నారు.
- ఇదే వ్యక్తి నాగరాజుపల్లి ప్రాంతంలో 3 టన్నుల గోదాము ఏర్పాటు చేసి పేలుడు పదార్థాల వ్యాపారం సాగిస్తున్నట్లు సమాచారం.

పచ్చ పార్టీ అండతోనే....

పేలుడు పదార్థాల లైసెన్స్‌దారులు చాలామంది పచ్చ పార్టీ అండతో అక్రమంగానే విక్రయాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. వీరంతా దాదాపు డీగార్డ్, దిఎఫ్, కేబుల్, వయరులో పొడి, తూటా (జెల్‌బాక్స్) 180, 200 మాటర్లు, బూస్టర్లు, ఈడీ (గిలిటెన్ స్టిక్స్), ఓడీ తదితర పేలుడు పదార్థాలను క్వారీలలో పేలుళ్ల కోసం విక్రయిస్తున్నారు. హైదరాబాద్, నాగపూర్, చైన్నై ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. కొందరు వ్యాపారులు నిషేధిత పేలుడు పదార్థాలను సైతం తెచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం.

పొంచి ఉన్న పెను ప్రమాదం

హైదరాబాద్, నాగపూర్, చైన్నై ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్న పేలుడు పదార్థాలను అనధికారికంగా గ్రానైట్ క్వారీల్లో పేలుళ్ల కోసం విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇది ప్రమాదమని తెలిసినా వ్యాపారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. లెక్కా పత్రం లేకుండా పేలుడు పదార్థాల విక్రయాల వల్ల పెను ప్రమాదాలకు ఆస్కారముంది. ఎక్స్‌ప్లోజర్స్ అసాంఘిక శక్తులకు చేరే ప్రమాదమూ ఉంటుంది. ఇదే జరిగితే ఊహించని నష్టం వాటిల్లవచ్చు. ఏ చిన్న అవకాశం దొరికినా అశాంతి సృష్టించేందుకు ఉగ్రమూకలు పొంచి ఉంటాయి. ఇలాంటి పరిస్థితిలో పేలుడు పదార్థాల విక్రయాలకు నియంత్రణ అవసరం. బిల్లులతో విక్రయాలు జరిగేలా చూడాలి. అధికారుల నిఘా మధ్య వాటిని వినియోగం ఉండేలా చర్యలు చేపట్టాలి. ఇప్పటికైనా మైనింగ్‌తోపాటు జిల్లా ఉన్నతాధికారులు పేలుడు పదార్థాల వినియోగంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

అండగా అధికార యంత్రాంగం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్వారీల్లోని పేలుళ్ల, పేలుడు పదార్థాల విక్రయాలు, వినియోగాన్ని అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. క్వారీ యజమానులతోపాటు పేలుడు పదార్థాల విక్రయదారులు దాదాపుగా పచ్చపార్టీ నేతలు, మద్దతుదారులు కావడంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. పైగా వ్యాపారులు దాదాపుగా చంద్రబాబు సామాజికవర్గం వారే కావడంతో అటువైపు తొంగిచూసేందుకు కూడా అధికారులకు ధైర్యం చాలడం లేదని తెలుస్తోంది. ఇటీవల మార్టూరులో ఇతర సామాజికవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతకు చెందిన ఎక్స్‌ప్లోజర్స్ గోదామును తనిఖీ చేసి నానా హంగామా చేసిన అధికారులు... చీమకుర్తి, బల్లికురవ, సంతమాగులూరు ప్రాంతాల్లో విక్రయాల జోలికి వెళ్లకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.



తాళం పగలగొట్టి బంగారం చోరీ

- 117 సవర్ల బంగారం, నగదు దొంగతనం
- పోలీసుల అదుపులో అనుమానితులు?



ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీం

చీరాల: పట్టణంలో మంగళవారం రాత్రి భారీ చోరీ జరిగింది. తాళం వేసిన ఇంటిలో బంగారం, నగదును దుండగులు కాజేశారు. ఈ ఘటన పట్టణంలోని పువ్వాడ వారి వీధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం రాత్రి మువ్వల శివప్రసాదరావు దంపతులు ఉడ్‌నగర్‌లోని హాస్పిటల్‌కు వెళ్లి రాత్రి వచ్చారు. ఇంటికి వేసిన తాళాలు పగలకొట్టి ఉండడంతో అనుమానంతో లోపలికి వెళ్లి చూశారు. ఇల్లంతా కారం చల్లి ఉంది. పరిశీలించగా బీరువాలో ఉంచిన 117 సవర్ల బంగారం, రూ.1.60 వేలు నగదు చోరీ అయినట్లు గుర్తించారు. వన్ టౌన్ పోలీసులకు బాధితులు సమాచారం అందించారు. పోలీస్ సిబ్బంది, క్లూస్ టీం సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరించారు. గతంలో వీరి వద్ద పనిచేసిన ఎలక్ట్రీషియన్, మరో వ్యక్తితో వచ్చి ఇంటి పరిసరాలలో అనుమానాస్పదంగా సంచరించి వెళ్లారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన వన్ టౌన్ సీఐ సుబ్బారావు ఇంటి పరిసరాల్లోని సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. అనుమానితుల్లో ఒకరు ఇంటి వద్ద నుంచి వెళ్లడంతో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మరో వ్యక్తి కోసం గాలింపు చేపట్టారు. తెలిసిన వ్యక్తి చేసిన పనేనని భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ముమ్మరం చేశారు.

ప్రియాంకా... వెల్ డన్!

- 21 సంవత్సరాలకే రూ.1.4 కోట్ల ప్యాకేజీతో అమెజాన్‌లో ఉద్యోగం
- సత్తా చాటిన ప్రత్తిపాడు మండలం పాత మల్లాయపాలేనికి చెందిన ప్రియాంకరెడ్డి
- యూకేలోని అమెజాన్ కార్యాలయంలో సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఇంజినీర్–1గా ఆఫర్ లెటర్
- వెల్లువెత్తుతున్న అభినందనలు



తల్లిదండ్రులు, సోదరుడితో కారుమూరి ప్రియాంకరెడ్డి



అచీవర్స్‌డేలో ప్రియాంకరెడ్డిని అభినందిస్తున్న గీతం యూనివర్సిటీ ప్రతినిధులు

ప్రత్తిపాడు: ఏపీకి చెందిన యువతి జాక్‌పాట్ కొట్టింది. అమెజాన్‌లో ఏకంగా రూ. 1.4 కోట్ల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగం సాధించింది. గీతం యూనివర్సిటీ హైదరాబాద్ క్యాంపస్‌లో సీఎస్ఈ ఫైనల్ ఇయర్ చదువుతున్న ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం గ్రామానికి చెందిన కారుమూరు ప్రియాంకరెడ్డికి ఈ కామర్స్ దిగ్గజం అమెజాన్ సంస్థలో భారీ ప్యాకేజీ ఆఫర్ చేసింది. యూకేలోని అమెజాన్ కార్యాలయంలో సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఇంజినీర్–1గా అవకాశం లభించింది. ప్రియాక చిన్నతనం నుంచే చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచేది. తొమ్మిది, పది తరగతులు గుంటూరు శ్రీ చైతన్యలో, ఇంటర్ హైదరాబాద్ చైతన్యలో పూర్తి చేసింది. అంతకుముందు కొంత కాలంలో యూఎస్‌లో కూడా విద్యనభ్యసించింది. ప్రస్తుతం గీతంలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. మార్చిలో యూనివర్సిటీలో క్యాంపస్ సెలక్షన్లు జరిగాయి. మంగళవారం జరిగిన అచీవర్స్ డేలో గీతం ప్రతినిధులు ప్యాకేజీ వివరాలను వెల్లడించి, ఆఫర్ లెటర్‌ను అందించి అభినందించారు. కారుమూరి శ్రీనివాసరెడ్డి, చంద్రకళ ఇద్దరూ ప్రత్తిపాడు మండలానికి చెందిన వారే. ప్రత్తిపాడుకు చెందిన చంద్రకళకు పాతమల్లాయపాలేనికి చెందిన శ్రీనివాసరెడ్డితో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. కుమారుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, కుమార్తె ప్రియాంకరెడ్డి. అయితే, కొన్నేళ్ల కిందట పాతమల్లాయపాలెం నుంచి హైదరాబాద్‌కు వెళ్లిన వీరు అక్కడే స్థిరపడ్డారు.

గతంలోనే పలు క్యాంపస్ సెలక్షన్లు

ప్రియాంక రెడ్డి క్యాంపస్ సెలక్షన్లలో ఎంపికవ్వడం ఇదే మొదటి సారి కాదు. అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తూ అమెజాన్ కంటే ముందు 30 లక్షల ప్యాకేజీతో బెంగళూరుకు చెందిన న్యూ సిగ్మా కంపెనీలో, యాక్సెంచర్ కంపెనీ ప్రాంగణ ఎంపికల్లో ఎంపికైంది. అయినప్పటికీ వాటిని వద్దనుకుని, అమెజాన్‌లో భారీ వేతనంతో కూడిన ఉద్యోగానికి ఎంపికైంది. దీంతో తల్లిదండ్రులు శ్రీనివాసరెడ్డి, చంద్రకళతో పాటు సోదరులు, కుటుంబ సభ్యులు ఆమెను అభినందించారు. స్వగ్రామమైన పాతమల్లాయపాలెంలో ఉన్న బంధువులు, శ్రీనివాసరెడ్డి స్నేహితులు సైతం హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. కోడింగ్‌పై శిక్షణ, ఫ్యాకల్టీల మార్గనిర్దేశంతో పాటు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో అత్యధిక గరిష్ట వేతనంతో ఉద్యోగానికి ఎంపకయ్యానని ప్రియాంక రెడ్డి తెలిపారు.


ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశాం

- మార్టూరు సీఐ శేషగిరిరావు
- అర్ధరాత్రి దాటాక మీడియా గ్రూపులో వీడియో పోస్టు

మార్టూరు: మార్టూరు మండల వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు అట్లూరు సుకుందరావు తనపై చేసిన ఆరోపణలు వాస్తవం కాదని, ఇరుపక్షాల ఫిర్యాదులపై కేసులు నమోదు చేసినట్లు మార్టూరు సీఐ శేషగిరిరావు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం తెల్లవారుజామున రెండు గంటలకు మార్టూరు మీడియా గ్రూపులో ఓ వీడియో పోస్ట్ చేశారు. తమ కాలనీలో సోమవారం రాత్రి జరిగిన ఘర్షణలో టీడీపీ నాయకుడి ఒత్తిడితో సీఐ శేషగిరి తమ ఫిర్యాదును తీసుకోకుండా తమ ప్రత్యర్థుల ఫిర్యాదుతో తమపై మాత్రం కేసు పెట్టారని సుకుందరావు ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. మంగళవారం తెల్లవారుజామున సుకుందరావు తన చేతిని కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించిన సంగతి కూడా తెలిసిందే. సుకుందరావు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని అంటూ ఆసుపత్రి వైద్యులు మెడికో లీగల్ కేసుగా పరిగణిస్తూ రిపోర్టును మంగళవారం ఉదయం 6.30 గంటలకు స్టేషనుకు పంపించారు. అదంతా అవాస్తమని వీడియో రిలీజ్ చేసిన సీఐ శేషగిరి.. బుధవారం తెల్లవారుజామున రెండు గంటల వరకు ఏం చేశారంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు. సీఐ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ మంగళవారం ఉదయం 11 గంటలకు ఆసుపత్రి నుంచి వీడియో ద్వారా సుకుందరావు మీడియాకు తెలిపారు. ఇరువర్గాలపై కేసులను రిజిస్టర్ చేశానని సీఐ ఎప్పటికోగానీ వీడియో ద్వారా చెప్పే ప్రయత్నం చేయడంలోనే ఆయన నిజాయతీ అర్థమవుతోందని స్థానికులు భావిస్తున్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు మార్టూరు పోలీస్ స్టేషన్ను ఒకసారి సందర్శిస్తే సీఐ బాధితులు ఎంతమంది ఉన్నారనే విషయం వెలుగు చూస్తుందని పేర్కొంటున్నారు. సీఐ శేషగిరి ఇక్కడ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగిన వ్యవహారాలపై విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు.

సమాజంపై నాటకాల ప్రభావం

సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు



బహుమతి ప్రదానం చేస్తున్న పరుచూరి వెంకటేశ్వరరావు

భట్టిప్రోలు (కొల్లూరు) : సమాజాన్ని పెనుమార్పుల నుంచి మంచి వైపు నడిపేలా ప్రభావితం చేయడానికి నాటక రంగం దోహదపడుతుందని సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని పల్లెకోనలో నాలుగో రోజు పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్మారక 35వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటక, నాటిక పోటీలు జరిగాయి. ఇందులో ఆయన మాట్లాడుతూ.. నాటకాలు, నాటికల ద్వారా సమాజానికి అవసరమైన సందేశాన్ని ప్రజలకు అందించడానికి సాధ్యపడుతుందన్నారు. బుధవారం రాత్రి ప్రదర్శించిన విజయవాడకు చెందిన యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ మైలురాయి నాటకంలో ప్రస్తుత సమాజంలో న్యాయవ్యవస్థలో లోపాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించి కళాకారులు ప్రేక్షకుల మన్ననలు పొందారు. హైదరాబాద్‌కు చెందిన సిరి మువ్వ కల్చరల్స్ ప్రదర్శించిన హక్కు నాటికలో ఆడపిల్ల ఆస్తులు, హక్కులకు ప్రాధాన్యత ఇవ్వడం నేటి సమాజంలో పరిపాటిగా మారిందని తెలిపారు. ప్రేమాభిమానాలతో పెంచి పెద్దచేసిన సంఘటనలను గుర్తుంచుకొని మెలగాలని సందేశాన్ని ఇచ్చారు. తాడేపల్లికి చెందిన ఆరవింద ఆర్ట్స్ ప్రదర్శించిన విడాకులు కావాలి నాటిక ద్వారా చిన్న విషయాలకే విడాకుల కోసం కోర్టులను ఆశ్రయించకుండా మనస్సు విప్పి మాట్లాడుకుంటే అన్నీ సర్దుకుంటాయని సందేశాన్ని అందించారు. నాటక, నాటిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వాహకుడు, సినీ రచయత పరుచూరి వెంకటేశ్వరరావు కళాకారులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు.

ఎవరేమనుకుంటే మాకేంటి ?

- ఆర్యవైశ్యుల మనోభావాలతో మాకు పనేంటి
- ముగిసిన స్వయం ప్రకటిత కమిటీ ప్రమాణస్వీకారం
- రాష్ట్ర, కేంద్ర మంత్రులు గైర్హాజరు



స్వయం ప్రకటిత కమిటీ ప్రమాణస్వీకారం. వేదికపై ఆలపాటి రాజా, బాలస్వామీజీ

తెనాలి: ఎవరేమనుకుంటే మాకేంటి. వేలాది ఆర్యవైశ్యుల మనోభావాలతో మాకు పనేంది. అన్నట్టుగా ఉంది శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం సత్రం కమిటీ స్వయం ప్రకటిత పాలకవర్గం వైఖరి. వివాదం హైకోర్టులో ఉంది. ఈనెల 4న సర్వసభ్య సమావేశం నిర్వహణకు నోటీసులు జారీఅయ్యాయి. అందులో తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ప్రస్తుత పాలకవర్గం ప్రకటించింది. అయినా సరే, హడావుడిగా స్వయం ప్రకటిత కమిటీ పాలకవర్గం బుధవారం రాత్రి ప్రమాణ స్వీకారోత్సవం అనే తంతును ముగించింది. దేవస్థానం కమిటీ పాలకవర్గం అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు అస్వస్థతతో అమెరికాలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈనెల 4న జరిగే సర్వసభ్య సమావేశంలో సమష్టిగా నిర్ణయం తీసుకోవాలని సందేశం పంపారు. ఉపాధ్యక్షుడు ఆకి అచ్యుతరావు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అయినా సరే, ఏకపక్షంగా మొండిగా స్వయం ప్రకటిత పాలకవర్గం అధ్యక్షుడిగా ప్రకటించుకున్న పెండేల వెంకట్రావు, కార్యదర్శి తాతా శ్రీనివాసరావు తదితర సభ్యుల కమిటీ రాత్రి 9 గంటల ప్రాంతంలో దేవస్థానం ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేశారు. పెనుగొండ పీఠాధిపతిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) సమక్షంలో బాపట్ల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా వీరిచేత ప్రమాణం చేయించారు. వెయ్యి మంది సభ్యులు కలిగిన దేవస్థానం కమిటీలో కనీసం రెండు వందలమంది కూడా ఈ వేడుకకు హాజరు కాలేదు. పోలీసులు మోహరించి ఉన్నారు. ఏదో చేశామన్నట్టుగా ప్రమాణ స్వీకారమనే తంతును కానిచ్చేశారు. కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరవుతారని ఆహ్వాన పత్రికల్లో ప్రముఖంగా వేసినా వారెవ్వరూ పాల్గొనలేదు. ఎమ్మెల్సీ ఆలపాటి మాత్రం హాజరయ్యారు. ఆలయ కార్యాలయం గది తాళాలను స్వయం ప్రకటిత కమిటీ పగులగొట్టి కొత్త తాళాలను వేసిన విషయం తెలిసిందే. అవి మినహా మిగిలిన దేవాలయం కళ్యాణ మండపాలు, రికార్డులు, బ్యాంకు ఖాతాలు అన్నీ దేవస్థానం కమిటీ ఆధీనంలోనే ఉన్నాయి. స్వయం ప్రకటిత కమిటీ పాలకవర్గం అధ్యక్షుడు పెండేల వెంకట్రావు తాళాల కోసం కమిటీ ఉపాధ్యక్షుడు ఆకి అచ్యుతరావును ఫోనులో బెదిరించిన ఆడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.

రైతులకు మరింత చేరువ కావాలి

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు



గుంటూరు రూరల్: విశ్వవిద్యాలయం రైతులకు మరింత చేరువ కావాలని, ఆధునిక టెక్నాలజీ రైతు ఉపయోగించుకునే విధంగా ఎప్పటికప్పుడు సహాయకారిగా ఉండాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవ వేడుకలు గత రెండు రోజులుగా ఘనంగా నిర్వహించారు. బుధవారం ముగింపు ఉత్సవంలో ముఖ్య అతిథిగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుకు దిగుబడి పెరగడంతో పాటు ఖర్చు తగ్గించే దిశగా ప్రణాళికలు రచించాలని తెలిపారు. పల్నాడు ప్రాంతంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రారంభించేందుకు అనుమతి లభించిందని, దానికి ఆర్థిక (ఫైనాన్షియల్) శాంక్షన్ మాత్రం పెండింగ్‌లో ఉందని తెలియజేశారు.

క్లుప్తంగా

జిల్లా టీకాల అధికారిగా రత్న మన్మోహన్



బాపట్ల: జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిగా డాక్టర్ చుక్కా రత్న మన్మోహన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రాం మానిటరింగ్ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై బాపట్లకు వచ్చారు. ఈ మేరకు బాపట్ల జిల్లా వ్యాధి నిరోధక టీకాల పంపిణీలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.

జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్‌గా మోహన్‌రాజు



బాపట్ల: జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా టి.మోహన్‌రాజు పదవీ బాధ్యతలు చేపట్టారు. బాపట్ల జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఆయన డివిజనల్ పౌర సంబంధాల అధికారిగా పనిచేస్తున్నారు. రెండు సంవత్సరాలు బాపట్ల జిల్లాలో పనిచేశారు. 2024 జనవరిలో జిల్లా పౌర సంబంధాల అధికారిగా పదోన్నతిపై నెల్లూరు జిల్లాకు వెళ్లారు. నవంబర్‌లో డిప్యూటేషన్‌పై జిల్లా పౌర సంబంధాల అధికారిగా బాపట్ల జిల్లాకు వచ్చారు. బాపట్ల జిల్లా సమాచార శాఖకు పూర్తి అదనపు బాధ్యతలపై అసిస్టెంట్ డైరెక్టర్‌గా ప్రభుత్వం ఆయన్ను నియమించింది. జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆయన పదవీ బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది సీనియర్ సహాయకులు పద్మావతి, జూనియర్ సహాయకులు రవి, సుభాని, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో రేపల్లె వాసికి రెండు స్వర్ణాలు



నిజాంపట్నం: ఫెడరేషన్ కప్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో రేపల్లె వాసి రెండు స్వర్ణ పతకాలు సాధించారు. వరల్డ్ తైక్వాండో ఆధ్వర్యంలో ఏప్రిల్ 25 నుంచి 30వ తేదీ వరకు మహారాష్ట్రలో జరిగిన ఈ పోటీల్లో రేపల్లెకు చెందిన రాష్ట్ర తైక్వాండో సంఘం ప్రధాన కార్యదర్శి కోకిలిగడ్డ వెంకటేశ్వరరావు ప్రతిభ చాటారు. రెండు స్వర్ణ పతకాలు సాధించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ త్వరలో జరిగే అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన్ను పలువురు ప్రముఖులు అభినందించారు.

కల్యాణం.. వైభోగమే!

మే నెలలో మంచి ముహూర్తాలు ఉండటంతో కల్యాణాలు భారీగా జరగనున్నాయి. పెళ్లంటే ఒకప్పుడు పచ్చని పందిళ్లు, ఐదారు రోజులపాటు ఇంట్లో వేడుక నడిచేది. ఇప్పుడు శుభకార్యాలూ కొత్త పుంతలు తొక్కాయి. ఇప్పుడు పెళ్లంటే వెడ్డింగ్ షూట్లు, కల్చరల్ ప్రోగ్రాములతో నిర్వహిస్తున్నారు. ముహూర్తాలతో సంబంధిత వ్యాపారాలు ఊపందుకున్నాయి.

- మే నెలలో పలు శుభ ముహూర్తాలు
- జిల్లాలో 2 వేల వరకు వివాహాలు జరిగే అవకాశం
- వివిధ పట్టణాల్లో మండపాలకు పెరిగిన డిమాండ్
- ఊపందుకున్న వస్త్ర, బంగారు విక్రయాలు
- పెళ్లిళ్లకు సంబంధించిన వ్యాపారులు బిజీ



ఏసీ కల్యాణ మండపం

అద్దంకి: ప్రతి వ్యక్తి జీవితంలో వివాహం ఒక పండుగ లాంటిది. ఆ పండుగ చేసుకునే విధానాల్లో ఎన్ని కొత్త పోకడలు వచ్చినా ఆచార సంప్రదాయాలు మాత్రం మారలేదు. పెళ్లిలో తప్పకుండా భాజాభజంత్రీలు, మాంగల్యధారణ, తలంబ్రాలతో కుటుంబ సభ్యులు బంధు మిత్రుల మధ్య ఆనందంగా జరుపుకొంటున్నారు. ఆధునిక కాలంలో వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం పెళ్లిలోనూ చోటు సంపాదించుకుంది. డ్రోన్ కెమెరా షూటింగ్, ఫొటోగ్రఫీ, ప్రీ వెడ్డింగ్ షూట్, వెడ్డింగ్ షూట్, ఏసీ ఫంక్షన్ హాల్, విద్యుత్ సెట్టింగులు, భారీ డెకరేషన్లు ఈ రోజుల్లో పెళ్లిలో కనిపిస్తున్నాయి.

పెరిగిన ఖర్చులు

జిల్లాలోని పట్టణాల్లోని పెళ్లిళ్ల సీజన్ మొదలవగానే బట్టలు దుకాణాలు, పెళ్లి మండపాలు, డెకరేషన్ సామగ్రి, భాజాభజంత్రీలు, సెట్టింగ్‌కు సంబంధించి వాటి ధరలు భారీగా పెరిగాయి. దాంతో ఆయా రంగాల మేనేజర్లకు, కూలీలకు చేతినిండా పని దొరుకుతోంది. వేసవి కావడంతో పాటు ఇటీవల పెళ్లిళ్లకు ఏసీ కల్యాణ మంటపాలను బుక్ చేసుకుంటున్నారు. అన్నీ ఒకే చోట దొరుకుతుండడంతో ఏ ఇబ్బందీ ఉండదని భావిస్తున్నారు. దానికి తోడు ఏసీ కల్యాణ మండపాల్లో భారీ సెట్టింగులతో వివాహాలు చేస్తే తమ హోదాను కూడా చాటుకోవచ్చని భావిస్తున్నారు. పూల మండపాలను మిరమిట్లు గొలిపే విద్యుత్ దీపాల సెట్టింగులు, బెలూన్లతో డిజైన్లు వేసి సిద్ధం చేస్తున్నారు. దీనికి సుమారు రూ.2 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు వ్యయం అవుతోంది. గతంలో పట్టణాల్లో ఉండే ఈ హడావుడి ప్రస్తుతం పల్లెలకు పాకడంతో వివాహ ఖర్చులు పెరిగిపోయాయి. ఒక్కొక్క వివాహానికి క్లాత్ డిజైన్ సెట్టింగులు రూ.25 వేల నుంచి రూ.లక్షకుపైగా ఖర్చు చేస్తున్నారు. పూల మండపానికి రూ.25 వేల నుంచి రూ.1,75,000 కూడా వ్యయం అవుతోంది. ఎల్‌ఈడీ స్క్రీన్లు, లేజర్ స్క్రీన్లు ఏర్పాటు చేస్తే మరింత ఖర్చు పెడుతున్నారు. ఆర్థిక స్తోమతను బట్టి వారు ఉన్నంతలో వివాహాలను ఘనంగా జరిపించేందుకు సిద్ధమవుతున్నారు.

ఈ నెలలో ముహూర్తాలు ఇవే..

మే నెలలో 2, 5, 6, 8, 15, 17, 18, 22, 24, 27, 28వ తేదీలు మంచి ముహూర్తాలు ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. అద్దంకి, చీరాల, వేమూరు, పర్చూరు, తెనాలి వంటి నగరాల్లోనే కాకుండా ఆయా పట్టణాల పరిధిలోని గ్రామాల్లోనూ వివాహ వేడుకలు 2 వేలకు పైగా జరుగుతాయని అంచనా వేస్తున్నారు. దీంతో పెళ్లిళ్లకు అనుబంధంగా ఉండే వ్యాపారాలన్నీ పుంజుకున్నాయి.

అంతా క్యాటరింగ్ మయం

గతంలో ఒక వివాహం జరిగితే బంధువులు, తెలిసిన వాళ్లు వచ్చి పిండి వంటలు, భోజనాలను అవసరమైన వంటలు వండటంతోపాటు వడ్డించేవారు. ఇప్పుడు ఆ సంప్రదాయం పోయింది. అంతా క్యాటరింగ్ మయమైంది. ఆర్డర్ ఇస్తే చాలు క్యాటరింగ్ వారే భోజనాలు సహా అన్నీ వడ్డిస్తున్నారు. ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోవడం, బంధువుల్లో వంటావార్పు చేసేవారు తగ్గడంతో క్యాటరింగ్‌కు మంచి డిమాండ్ ఏర్పడింది. వీరు ఒక్కో వేడుకకు మెనూ బట్టి ధరను నిర్ణయిస్తున్నారు. వివాహ ముహూర్తాలు ఒకే నెలలో ఎక్కువ ఉండటంతో వస్త్ర, నగల వ్యాపారాలు కూడా ఊపందుకుంటున్నాయి.



వివాహ మండపం సెట్టింగ్

మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి



ర్యాలీలో భాగంగా అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

చీరాల రూరల్: కేంద్ర ప్రభుత్వం-మావోయిస్టులు తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలకు సంకేతాలు ఇవ్వాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివాసీలతో బుధవారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత జనసమాఖ్య వ్యవస్థాపకుడు డాక్టర్ మాచర్ల మోహనరావు మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాలలో ఖనిజ సంపదను విదేశీ సంస్థలు కొల్లగొట్టకుండా అడ్డుకుంటున్న ఆదివాసీలను, వారికి మద్దతిస్తున్న మావోయిస్టులపై కేంద్రం దాడులను కొనసాగించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నల్లబోతుల మోహన్‌కుమార్ ధర్మ మాట్లాడుతూ ఆదివాసీలను కేంద్రం శత్రువులుగా భావిస్తోందన్నారు. చీరాల అభివృద్ధి సాధన సమితి నాయకులు శీలం రవికుమార్ మాట్లాడుతూ దేశంలో అంతర్గత భద్రత కూడా ముఖ్యమన్నారు. బీసీ ఫెడరేషన్ నాయకుడు ఊటుకూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆదివాసీలతోపాటు మైనారిటీలకు రక్షణ కరవైందన్నారు. నాయకులు గాదె హరిహరరావు, చుండూరి వాసు, షేక్ బషీర్, అబ్దుల్లా, దేవన వీరనాగేశ్వరరావు, మేడిన వెంకటరెడ్డి, గుంటూరు మల్లికార్జునరావు, షేక్ జిలాని, యానాది సంఘాల నాయకులు మానికల పౌలస్, పద్మ, ఏలియ, కనకయ్య, జి. అశోక్, సత్యానందం, విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

బీచ్ కబడ్డీ పురుషుల జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఎస్‌ఐ రమేష్, కోచ్ గిరిబాబు తదితరులు

చినగంజాం: 12వ బీచ్ కబడ్డీ స్టేట్ చాంపియన్ షిప్‌కు ఉమ్మడి ప్రకాశం జిల్లా పురుషుల తుది జట్టు ఎంపిక బుధవారం నిర్వహించారు. ఈ నెల 20వ తేదీన నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 25 మంది పాల్గొనగా, వారిలో 15 మంది ప్రాబబుల్స్‌గా ఎంపిక చేశారు. 21 నుంచి 30 వ తేదీ వరకు శిక్షణ నిర్వహించారు. అనంతరం బుధవారం తుది జట్టును ఖరారు చేశారు. జిల్లా జట్టుకు అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు ఎం. గిరిబాబు కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. చినగంజాం ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ శీలం రమేష్ విచ్చేశారు. ప్రకాశం జిల్లా పురుషుల జట్టుకు క్రీడా దుస్తులను డాక్టర్ నల్లూరి సుబ్బారావు సమకూర్చగా, క్రీడాకారులకు ఎస్ఐ అందజేశారు. తుది జట్టులో ఆరుగురు క్రీడాకారులను ఎంపిక చేశారు. మరో ఏడుగురు స్టాండ్ బైగా ఎంపికయ్యారు. ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, కార్యదర్శి పూర్ణచంద్రరావులు క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. మే నెల 2, 3, 4వ తేదీలలో కాకినాడలో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీలలో ఈ జట్టు పాల్గొంటుందని ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పెర్నేటి ప్రకాష్, సాంబశివరావు, ఎం.గిరిబాబు, పీడీ శివ, కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

జట్టు సభ్యులు వీరే: ఎన్. ఉమామహేశ్వరరావు, బి. సురేష్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, పి. బ్రహ్మారెడ్డి, జి. లక్ష్మారెడ్డి, ప్రసాద్ రెడ్డిలను ఎంపిక చేశారు. స్టాండ్‌బైగా జి.లక్ష్మారెడ్డి, కె.వెంకటేష్ రెడ్డి, పి. బాలకృష్ణారెడ్డి, కె. హరిప్రసాద్‌రెడ్డి, రామాంజీ తదితర ఏడుగురిని ఎంపిక చేశారు.

ప్రధాని సభకు ప్రత్యేక బస్సులు

బల్లికురవ: అమరావతి రాజధానిలో మే నెల 2వ తేదీన జరగబోయే ప్రధాని నరేంద్ర మోడీ సభకు అన్నివిధాలా సిద్ధం కావాలని మండల ప్రత్యేకాధికారి దేవదత్తు కోరారు. బుధవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బందితో జరిగిన సమావేశంలో మాట్లాడారు. మండలానికి 13 బస్సులు కేటాయించారని చెప్పారు. ఎంపీడీవో కుసుమ కుమారి, డిప్యూటీ ఎంపీడీఓ దాసరి సుమతి, వెలుగు ఏపీఎం రాజారావు పాల్గొన్నారు.

కారంచేడు: మండలంలోని 14 గ్రామాల నుంచి ప్రధాన మంత్రి సభకు 11 బస్సులను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ కె.నేతాజీ తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ మండల కేంద్రమైన కారంచేడులో రెండు పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే స్వర్ణ-3, కుంకలమర్రు-1, తిమిడెదపాడు, యర్రంవారిపాలెం, ఆదిపూడి-1, దగ్గుబాడు, పోతినవారిపాలెం-1, స్వర్ణపాలెం, కొడవలివారిపాలెం, కేశవరప్పాడు-1, జరుబులవారిపాలెం, నాయుడువారిపాలెం-1, రంగప్పనాయుడువారిపాలెం-1 పాయింట్లకు ఒక్కో బస్సును ఏర్పాటు చేశామని చెప్పారు. ఒక్కో పాయింట్‌కు ఒక్కో ఇన్‌చార్జ్‌ను కూడా నియమించామన్నారు.

అద్దంకి రూరల్: అమరావతి రాజధానిలో శుక్రవారం జరిగే ప్రధాని నరేంద్ర మోడీ సభను అద్దంకి మండలం నుంచి 13 బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో సింగయ్య బుధవారం తెలిపారు. బస్సుల్లో మహిళా పోలీస్, ఏఎన్ఎం, సచివాలయ సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. భోజన వసతి కూడా ఉంటుందని వివరించారు.

ప్రేక్షకాదరణే నాటకానికి ప్రాణం

చీరాల అర్బన్: సమాజానికి ప్రతిబింబమైన నాటకం ప్రేక్షకాదరణ ఉన్నంత కాలం సజీవంగా ఉంటుందని విశ్రాంత డీఎస్పీ బీరం నాగేశ్వరరావు అన్నారు. స్థానిక బాలికోన్నత పాఠశాల ఆవరణలో కళాంజలి ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ నాటకోత్సవాలు బుధవారంతో ముగిశాయి. కుటుంబ జీవితంలో మితిమీరిన స్వేచ్ఛ అనర్థదాయకమనే సందేశంతో విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్-హైదరాబాద్ వారు ప్రదర్శించిన 'స్వేచ్ఛ' నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. బీరం వెంకటసుబ్బయ్య, పున్నమ్మ కళావేదికపై జరిగిన నాటికకు బీరం సుందరరావు, భాగ్యలక్ష్మి దంపతులు ప్రదర్శనా పారితోషకాన్ని అందించి నటీనటులను అభినందించారు. అనంతరం దేశానికి కావాల్సింది అన్నం పెట్టే రైతులని చాటే 'మా ఇంట్లో మహాభారతం' నాటికను మద్దుకూరి ఆర్ట్స్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. ఐదురోజులు పాటు ప్రదర్శించిన నాటకాలు అందరిని ఆకట్టుకున్నాయి.

2 నుంచి రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు

చీరాల రూరల్: బాపట్ల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చీరాల ఎస్ఆర్ అండ్ పీఎం హైస్కూలు క్రీడా మైదానంలో మే నెల 2, 3, 4వ తేదీలలో రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ ఫుట్‌బాల్ (9 ప్లస్ 3) పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పోటీల నిర్వాహకులు నూతలపాటి విజయకుమార్ (దాసు) బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు రూ. 50 వేలు, రూ. 30 వేలు, రూ. 20 వేలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

సేద్యం విభాగంలో హోరాహోరీ పోరు

వేటపాలెంకి చెందిన ఎడ్ల జతకు ప్రథమ బహుమతి



బలప్రదర్శనలో బండ లాగుతున్న ఎడ్ల జత

దాచేపల్లి: స్థానిక శ్రీ వీర్ల అంకమ్మతల్లి కొలుపుల తిరునాళ్ల సందర్భంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు బుధవారం హోరాహోరీగా జరిగాయి. సేద్యం విభాగంలో జరిగిన ఎడ్ల బల ప్రదర్శన పోటీలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకి చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లజత 5,122 అడుగుల దూరం బండలాగి విజేతగా నిలిచాయి. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడుకి చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్లజత 4,757 అడుగుల దూరం బండలాగి రెండవస్థానం, పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఉయ్యందంకి చెందిన సంపటం వీరబ్రహ్మం నాయుడు ఎడ్లజత 4,750 అడుగుల దూరంబండలాగి మూడవస్థానం, సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కోదాడకి చెందిన షేక్ హుస్సేన్, హుజూర్‌నగర్‌కి చెందిన జక్కుల సహస్ర యాదవ్ సంయుక్త ఎడ్లజత 4,644 అడుగుల దూరం బండలాగి నాల్గవస్థానం, కృష్ణ జిల్లా తోటవల్లూరు మండలం చినపులిపాకకి చెందిన ఆర్‌వీఎస్ బుల్స్, పల్నాడు జిల్లా మాచవరం మండలం కొత్తపాలెంకి చెందిన యామిని మోహన్‌శ్రీ సంయుక్త ఎడ్లజత 4,250 అడుగుల దూరంబండలాగి ఐదవస్థానం, ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం మర్రివేములకి చెందిన సిద్ది మల్లేశ్వరి ఎడ్లజత 3,914 అడుగుల దూరంబండలాగి ఆరవస్థానంలో నిలిచాయి. విజేతలైన ఎడ్ల జతల రైతులకు నగదు, షీల్డ్‌ని దాతలు బహూకరించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా గూడా శ్రీనివాసరావు వ్యవహరించారు. కమిటీ సభ్యులు కొప్పుల గిరి, అనిశెట్టి శ్రీనివాసరావు, మునగా నిమ్మయ్య, కానుకొల్లు ప్రశాంత్ పోటీలను పర్యవేక్షించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

మార్టూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మంగళవారం రాత్రి మరణించాడు. పల్నాడు జిల్లా దోగి పర్రు గ్రామానికి చెందిన గుంటుపల్లి భరత్ తన స్నేహితుడు నల్లి బోయిన ప్రవీణ్ యాదవ్తో కలిసి బైకుపై ఒంగోలు నుంచి గుంటూరు వైపు బయటుదేరాడు. జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి కొలలపూడి సమీపంలో బైకును వెనుక నుంచి ఓ కారు వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని హైవే మొబైల్ సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. ప్రథమ చికిత్స అనంతరం 108 సిబ్బంది భరత్ను గుంటూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న భరత్ పరిస్థితి విషమించడంతో అదే రోజు రాత్రి మృతి చెందాడు.

బాల్యం నుంచే పుస్తక పఠనం నేర్పాలి

చీరాల అర్బన్: బాల్యం నుంచే పిల్లలను గ్రంథాలయాలకు వెళ్లేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని గ్రంథపాలకురాలు డి.ధనమ్మ బుధవారం అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. తరగతులను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. వేసవి సెలవుల్లో సమయం వృథా చేయకుండా చిన్నారులు ప్రతిరోజూ గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదివితే విజ్ఞానాన్ని సముపార్జించుకోవచ్చన్నారు. స్పోకెన్ ఇంగ్లిషు, డ్రాయింగ్, డ్యాన్స్ నేర్చుకోవడం ద్వారా మానసిక వికాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో స్వర్ణ జెడ్పీ హైస్కూల్ ఇంగ్లిషు ఉపాధ్యాయులు షేక్ కమల్ బాబు బోధించారు. వాడరేవు జెడ్పీ హైస్కూల్ బయాలజీ టీచర్ ఎం.లూకా విద్యార్థులకు బోధన చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని కొణికిరోడ్డులో రవి ఫంక్షన్ హాలు సమీపంలో రోడ్డు పక్కన పాదచారులు బుధవారం ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహంపై గాయాలు ఉండటంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతుని వయస్సు 50 ఏళ్ల ఉంటుందని భావిస్తున్నారు. తెల్లగా మాసిన గడ్డం ఉంది. బ్లూ నిలువు గళ్ల నిక్కరు, తెలుపు, నలుపు, ఆకుపచ్చ రంగులు కలిగిన నిండు చేతుల చొక్కా ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఇతని సమాచారం తెలిస్తే 91211 02148 ఫోను నంబరుకు తెలియజేయాలని ఎస్ఐ జి. సురేష్ తెలిపారు.